క్లుప్తంగా

విలువలు నేర్పడం అభినందనీయం



మైలవరం: టెక్నాలజీతో పాటు శిక్షణ కార్యక్రమంలో మోరల్ వాల్యూస్ నేర్పించడం అభినందనీయమని ఎంఈఓ ఎల్. బాలు తెలిపారు. మైలవరం మదర్‌థెరీసా చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో మోస్ట్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రెండు నెలల పాటు నిర్వహించిన ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులు శనివారం విజయవంతంగా ముగిశాయి. ఈ సందర్భంగా శిక్షణ ముగించుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ చలవాది మధుసూదనరావు, కోయ సుధ, మోస్ట్ సెక్రటరీ జూలకంటి ప్రసాద్, అడ్వైజర్ సాగం జమిలిరెడ్డి, కోటేశ్వరరావు, దునకా ప్రసాద్, ద్రోణవల్లి విజయలక్ష్మి పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల లాజిస్టిక్ సెక్టార్ స్కిల్ కౌన్సిల్‌తో ఒప్పందం

మైలవరం: స్థానిక డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల యాజమాన్యం లాజిస్టిక్ సెక్టార్ స్కిల్ కౌన్సిల్ చెన్నై సంస్థతో బీబీఏ కోర్సుకు అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒప్పందం మేరకు సర్టిఫికెట్ ఆఫ్ కొలాబరేషన్‌ను ఆ సంస్థ జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ సర్టిఫికెట్ ప్రకారం బీబీఏ లాజిస్టిక్ కోర్స్‌కు విద్యా సంవత్సరం 2022–23 నుంచి 2026–27 వరకు అమలులో ఉంటుందన్నారు. కమిషనరేట్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్, డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, లాజిస్టిక్ సెక్టార్ స్కిల్ కౌన్సిల్ సంయుక్తంగా ఈ జరిగిన అవగాహన ఒప్పందం మేరకు ఈ సర్టిఫికెట్ జారీ చేసినట్లు పేర్కొన్నారు, దీని వలన బీబీఏ లాజిస్టిక్స్ కోర్సుకు గుర్తింపు లభిస్తుందని ప్రిన్సిపాల్ డాక్టర్ రవి తెలిపారు.

లంక భూములకు పరిష్కారం



కొటికలపూడి(ఇబ్రహీంపట్నం): దశాబ్దాల నాటి లంక భూములకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిష్కారం చూపారని జెడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి, ఎంపీపీ పాలడుగు జోత్స్న అన్నారు. మండలంలోని కొటికలపూడిలో లబ్ధిదారులకు శనివారం వారు పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీ వైస్ చైర్మన్ మాట్లాడుతూ ఏడాదికి మూడు పంటల పండే భూములకు ఇప్పటి వరకు హక్కు లేకపోవడంతో ప్రభుత్వ ప్రయోజనాలు అందేవికాదన్నారు. పట్టాల పంపిణీతో ప్రభుత్వం వ్యవసాయ రైతులకు అందించే అన్ని రకాల ప్రయోజనాలు అభిస్తాయన్నారు. 105.93 ఎకరాల్లో 121 మంది రైతులకు పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రెంటపల్లి నాగరాజు, తహసీల్దార్ శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ బండి నాగమణి, వైఎస్సార్ సీపీ నాయకులు దుర్గాప్రసాద్, దుర్గారావు, రాంబాబు, వెంకటరావు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత



ఆగిరిపల్లి: వైఎస్సార్ బీమా తక్షణ సాయాన్ని శనివారం బాధిత కుటుంబ సభ్యులకు వైఎస్సార్ సీపీ నాయకులు అందజేశారు. ఈదులగూడెం గృహసారథి బాలాజీ అనారోగ్యంతో శుక్రవారం మరణించాడు. వైఎస్సార్ బీమా ద్వారా తక్షణ సాయంగా మంజూరైన రూ.10 వేలను బాలాజీ భార్యకు పీఏసీఎస్ అధ్యక్షుడు ఈలప్రోలు సుబ్బయ్య అందజేశారు. మండల సచివాలయ కన్వీనర్ నండూరి భాస్కర్ ప్రసాద్, యాదవ సంఘం జిల్లా డైరెక్టర్ గంగాధర్, వెల్ఫేర్ అసిస్టెంట్ నాగరాజు పాల్గొన్నారు.

పాడి రైతులకు బోనస్ పంపిణీ



నూజివీడు: మండలంలోని గొల్లపల్లి పాల కేంద్రం సభ్యులకు శనివారం కృష్ణా పాల సమితి ఆధ్వర్యంలో బోనస్‌ను పంపిణీ చేశారు. 2022–23 సంవత్సరానికి గాను లీటరుకు రూ.2.69 చొప్పున రూ.4.07 లక్షలను కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు చేతుల మీదుగా రైతులకు బోనస్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు జక్కుల వీరరాఘవయ్య, బోర్డు డైరెక్టర్ శనగల వెంకట శివజ్యోతి, మేనేజర్ కిరణ్, సూపర్‌వైజర్ వీరాంజనేయులు, వేతన కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు.

రసవత్తరంగా 'ఆడుదాం ఆంధ్రా' పోటీలు

నూజివీడు: రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 26నుంచి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు రసవత్తరంగా కొనసాగుతున్నాయి. మండలంలో పల్లెర్లమూడి, యనమదల, పడమర దిగవల్లి, మీర్జాపురం హైస్కూళ్లలో ఏర్పాటు చేసిన కోర్టులందు సచివాలయాల స్థాయిలో పోటీలను నిర్వహిస్తున్నారు. పల్లెర్లమూడి హైస్కూల్లో శనివారం మహిళలకు ఖోఖో, పురుషుల కబడ్డీ పోటీలను ఎంపీడీఓ వీపీ విజయ్‌కుమార్ ప్రారంభించారు. మహిళల ఖోఖో పోటీల్లో ఎంఎస్‌పాలెం జట్టు విజేతగా నిలిచి మండల స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ పోటీలను పీడీ నాగమణి నిర్వహిస్తుండగా పంచాయతీరాజ్ ఏఈ సుభాకర్ పర్యవేక్షించారు.

జి.కొండూరులో..

జి.కొండూరు: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా జి.కొండూరు మండలంలోని ఏడు గ్రామ సచివాలయాల పరిధిలో శనివారం నిర్వహించిన వివిధ పోటీల్లో 25జట్లు పాల్గొన్నట్లు ఎంపీడీఓ అనురాధ తెలిపారు. 288మంది క్రీడాకారులు పోటీ పడినట్లు పేర్కొన్నారు.

విస్సన్నపేటలో..

విస్సన్నపేట: గ్రామ సచివాలయాల స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడలకు విశేష స్పందన లభిస్తుంది. మండలంలోని 15 గ్రామ సచివాలయాల పరిధిలో శనివారం నిర్వహించిన క్రికెట్ పోటీలకు 57 ములు పాల్గొన్నాయి. తాతకుంట్ల గ్రామంలో క్రికెట్ పోటీలను ఎంపీడీఓ వెంకటరమణ, గ్రామ సర్పంచ్ వెంకటేశ్వరరావు పరిశీలించారు.

క్రీడా స్ఫూర్తితో..

ముసునూరు: క్రీడా స్ఫూర్తితో ఆటలు ఆడి మండలానికి గుర్తింపు తీసుకురావాలని ఏపీ కో–ఆపరేటివ్ యూనియన్ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి పిలుపునిచ్చారు. ఎంపీడీఓ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో మండలంలోని మర్లపాలెంలో నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడలను శనివారం నేతలతో సందర్శించారు. ఖోఖో పోటీలను ప్రారంభించి, క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమాల్లో వైస్ ఎంపీపీ జగన్మోహనరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు మద్దిరామయ్య పాల్గొన్నారు.



నూజివీడు మండలం పల్లెర్లమూడిలో ఖోఖో పోటీల్లో యువతులు



విస్సన్నపేట మండలం తాతకుంట్లలో క్రికెట్ పోటీలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ వెంకటరమణ



ముసునూరులో బ్యాటింగ్ చేస్తున్న నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్

విజయవంతంగా..

ముసునూరు: నూజివీడు డివిజన్ వ్యాప్తంగా అన్ని మండలాల్లో ఆడుదాం ఆంధ్రా క్రీడలు విజయవంతంగా కొనసాగుతున్నాయని నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ పేర్కొన్నారు. ముసునూరు హైస్కూల్లో జరుగుతున్న క్రికెట్ పోటీలను ఎంపీపీ కొండా దుర్గాభవాని, జెడ్పీటీసీ సభ్యుడు డా.వరికూటి ప్రతాప్‌తో కలసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్, నేతలు కొద్దిసేపు బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్‌తో క్రీడాభిమానులను ఉత్సాహపరిచారు. పీడీలు ఆలీఖాన్, సుకుమార్, నాగమల్లేశ్వరమ్మ, వైస్ ఎంపీపీలు రాజానాయన, గంగాధర్, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ఎం.నాగవల్లేశ్వరరావు, జిల్లా పార్టీ యూత్ జాయింట్ సెక్రటరీ కోన రమేష్, ఎంపీడీఓ జి.రాణి, హెచ్‌ఎం సునీల పాల్గొన్నారు.

ఆగిరిపల్లిలో..

ఆగిరిపల్లి: చిన్నాఆగిరిపల్లి సచివాలయ పరిధిలో క్రికెట్ పోటీలను ఎంపీడీఓ శంకరరావు శనివారం టాస్ వేసి ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంగమయ్య, పీడీ నాగేంద్రరావు పాల్గొన్నారు.

రూ.45 లక్షలతో అభివృద్ధి పనులు

నగర పంచాయతీ చైర్‌పర్సన్ కస్తూరిబాయి



తిరువూరు నగరపంచాయతీ కౌన్సిల్ సమావేశం

తిరువూరు: తిరువూరు నగర పంచాయతీ పరిధిలోని పలు వార్డుల్లో రూ.45 లక్షల గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి తెలిపారు. నగర పంచాయతీ కౌన్సిల్ అత్యవసర సమావేశం చైర్‌పర్సన్ అధ్యక్షతన శనివారం జరిగింది. రూ.27 లక్షల ఎంపీ ల్యాడ్స్ నిధులతో నగర పంచాయతీకి అవసరమైన ట్రాక్టర్లు, వాటర్ ట్యాంకర్లను కూడా కొనుగోలు చేయాలని సమావేశంలో తీర్మానించారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలో మల వ్యర్థాలను శుద్ధి చేయడానికి ఫీకల్ స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంటు ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కౌన్సిల్‌లో నిర్ణయించారు. పట్టణంలో కోతుల బెడద నివారణకు రూ.99 వేలు కేటాయిస్తూ తీర్మానించారు. సమావేశంలో వైస్ చైర్‌పర్సన్లు విజయలక్ష్మి, వెంకటేశ్వరి, కమిషనర్ బాలకృష్ణ, కౌన్సిలర్లు పాల్గొన్నారు. తాగునీటి సరఫరా మెరుగుపరచాలని, పారిశుద్ధ్య కార్మికుల సమ్మె చేస్తున్నందున చెత్త తరలింపునకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కౌన్సిలర్లు కోరారు. తాగునీటి సమస్య ఉన్న వార్డుల్లో బోర్ల నిర్మాణం చేపట్టాలని, పాతతిరువూరు మదర్ థెరిసా విగ్రహం నుంచి రక్షిత మంచినీటి పథకం వరకు పైపులైన్ల నిర్మాణం చేపట్టాలని కౌన్సిలర్లు కోరగా, ఆమోదించారు.

పట్టణ అభివృద్ధికి తోడ్పాటు అందించాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ త్రివేణీదుర్గ



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ త్రివేణీదుర్గ

నూజివీడు: కౌన్సిలర్లు, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పట్టణ అభివృద్ధికి తోడ్పాటును అందించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ పేర్కొన్నారు. నూజివీడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించారు. సమావేశంలో చైర్‌పర్సన్ మాట్లాడుతూ మున్సిపాలిటీని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వ సహకారంతో నిరంతరం కౌన్సిల్ పాటుపడుతుందన్నారు. రహదారులు, డ్రెయినేజీల అభివృద్ధితో పాటు పారిశుద్ధ్య నిర్వహణ, వీధిలైట్ల నిర్వహణను సమర్థవంతంగా నిర్వహిస్తున్నామన్నారు.

కౌన్సిలర్ల నడుమ వాగ్వాదం

ప్రభుత్వ కార్యక్రమమైన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని టీడీపీ కౌన్సిలర్లకు చెందిన వార్డుల్లో నిర్వహించేటప్పుడు కనీసం ప్రొటోకాల్ ప్రకారం ఆహ్వానించకపోవడం దారుణమని టీడీపీ కౌన్సిలర్ చెరుకూరి దుర్గాప్రసాద్ అన్నారు. దీంతో వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, కో–ఆప్షన్ సభ్యులు రామిశెట్టి మురళీకృష్ణ, కౌన్సిలర్ శీలం రాములు చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అధికార పర్యటనలకు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేలనే పిలవలేదని, అవన్నీ మరిచిపోయి ప్రొటోకాల్ గురించి మాట్లాడటం ఆశ్చర్యంగా ఉందన్నారు. దీంతో ఇరు వర్గాల అరుపుల కేకలతో మున్సిపల్ కౌన్సిల్ సమావేశం కొద్దిసేపు దద్దరిల్లింది. అనంతరం వైస్ చైర్మన్ పగడాల మాట్లాడుతూ అభివృద్ధే ఎజెండాగా పార్టీలకతీతంగా పనిచేస్తున్నామన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సయ్యద్ అబ్దుల్ రషీద్, వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, కోఆప్షన్ సభ్యులు మెహబూబ్ బీ, మున్సిపల్ డీఈ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

స్ఫూర్తి మెటీరియల్‌తో ఉత్తమ ఫలితాలు



రెడ్డిగూడెంలో విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు విజయభాస్కరరెడ్డి



జి.కొండూరులో స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్న ఎంపీపీ లక్ష్మీతిరుపతమ్మ, జెడ్పీటీసీ జక్రధరరావు

జి.కొండూరు: పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు జిల్లా పరిషత్ చైర్మన్ ఉప్పాల హారిక అందిస్తున్న స్ఫూర్తి స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగపరచుకోవాలని ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ అన్నారు. మండల పరిధి వెలగలేరు, కవులూరు జెడ్పీ హైస్కూళ్లలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను జెడ్పీటీసీ సభ్యుడు జక్రధరరావుతో కలిసి ఆమె శనివారం పంపిణీ చేశారు. అదేవిధంగా కుంటముక్కల సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 8వ తరగతి విద్యార్థినులకు ట్యాబ్‌లను ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యుడు అందజేశారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

రెడ్డిగూడెం: మండలంలోని కూనపరాజుపర్వ గ్రామంలోని జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు శనివారం ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన జెడ్పీటీసీ సభ్యుడు విజయభాస్కర రెడ్డి మాట్లాడుతూ విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తెస్తూ పేద విద్యార్థులకు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యను అందిస్తున్న గొప్ప నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని పేర్కొన్నారు. అనంతరం జెడ్పీ చైర్మన్ ఉప్పాల హారిక రాము చొరవతో 10వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో తోటకూర రవి, సర్పంచ్ మాతంగి వెంకటేశ్వరరావు, పాకాలపాటి ప్రసాద్, చంద్రు శ్రీను, జి ప్రసాద్, స్కూల్ కమిటీ చైర్మన్ నారాయణ, స్కూలు ప్రిన్సిపాల్ జి. ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి పథకాలు

విస్సన్నపేట: విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలను అమలు చేస్తున్నట్లు ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి అన్నారు. స్థానిక ఆంధ్రప్రదేశ్ గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు జగనన్న స్ఫూర్తి స్టడీ మెటీరియల్‌ను శనివారం ఎంపీపీ పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ సాధుపాటి నాగమల్లేశ్వరి, మాజీ వైస్ ఎంపీపీ దుర్గారావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు కుటుంబరావు, నాయకుడు రాజేష్, పాఠశాల ప్రిన్సిపాల్ జాన్సన్ దేవరాజ్ పాల్గొన్నారు.



విస్సన్నపేటలో స్టడీమెటీరియల్ అందజేస్తున్న ఎంపీపీ మెర్సీ వనజాక్షి



ముసునూరు హైస్కూల్లో స్టడీ మెటీరియల్ పంపిణీ

ముసునూరులో..

ముసునూరు: జగనన్న ప్రభుత్వం విద్యాభివృద్ధికి కృషి చేస్తోందని ఎంపీపీ కొండా దుర్గాభవాని, జెడ్పీటీసీ సభ్యుడు డాక్టర్ వరికూటి ప్రతాప్ సూచించారు. ముసునూరులోని చారిత్రక జెడ్పీ హైస్కూల్లో హెచ్‌ఎం సునీల ఆధ్వర్యంలో ఎంఈఓ బీవీ సుబ్బారావు అధ్యక్షతన 110 మంది పదో తరగతి విద్యార్థులకు ఉమ్మడి కృష్ణా జిల్లా పరిషత్ విద్యాశాఖ అందజేసిన స్ఫూర్తి మెటీరియల్స్‌ను శనివారం పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీలు రాజానాయన, గంగాధర్, సర్పంచ్ విజయలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఎం.నాగవల్లేశ్వరరావు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

మైలవరం: నూతన సంవత్సర వేడుకలను డిసెంబర్ 31 రాత్రి సమయంలో పోలీస్ నిబంధనలు తప్పనిసరిగా పాటించి పోలీస్ వారికి సహకరించాలని మైలవరం సీఐ మోహన్‌రెడ్డి తెలిపారు. మైలవరం సీఐ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ మాట్లాడుతూ ప్రజలకు, యువతకు వారి తల్లిదండ్రులకు సూచనలిచ్చారు. వేడుకలు సాంస్కృతిక కార్యక్రమాల నిర్వాహకులు లౌడ్ స్పీకర్లు, మ్యూజిక్ సిస్టంలు ఉపయోగించేందుకు పోలీస్ అధికారుల నుంచి ముందస్తు అనుమతి తీసుకోసుకోవాలన్నారు. డీజేలతో నృత్యాలకుఉ అనుమతి లేదన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారి వాహనాన్ని సీజ్ చేసి రికార్డులు స్వాధీనం చేసుకుంటామన్నారు. ముఖ్యమైన కూడళ్లలో పోలీస్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేయనున్నట్లు సీఐ తెలిపారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి

ముసునూరు: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు వినియోగించుకోవాలని ఎంపీపీ కొండా దుర్గాభవాని సూచించారు. గుళ్ళపూడి, వలసపల్లి గ్రామాల్లో నోడల్ అధికారి ఏఓ మధుమోహన్ ఆధ్వర్యాన సర్పంచ్‌లు శ్రీదేవి శ్రీనివాస్, దామోదర్ అధ్యక్షతన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాలు శనివారం నిర్వహించారు. ఎంపీడీఓ జి.రాణి, ఎంపీటీసీ సత్యవాణి మూర్తి పాల్గొన్నారు.

యూటీఎఫ్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ



ఇబ్రహీంపట్నం: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యుటీఎఫ్) నూతన ఏడాది డైరీ, క్యాలెండర్‌ను ఎంఈఓ సీహెచ్ పుష్పలత, ఎంఈఓ–2 శ్యామ్‌బాబు మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద శనివారం ఆవిష్కరించారు. యూటీఎఫ్ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి రెడ్‌స్టార్, మండల అధ్యక్ష, కార్యదర్శులు అమర్‌నాయక్, ఆర్మ్‌స్ట్రాంగ్, కృష్ణారావు పాల్గొన్నారు.

కొండపల్లి విద్యార్థికి ఉత్తమ నటుడి అవార్డు



నంది అవార్డు అందుకున్న విద్యార్థి సంజయ్

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): గుంటూరులో జరిగిన నంది నాటకోత్సవాల్లో కొండపల్లికి చెందిన విద్యార్థి రేపాని సంజయ్‌కు ఉత్తమ నటుడి అవార్డు లభించింది. స్థానిక క్రాంతి హైస్కూల్ విద్యార్థులు ఈనెల 26న ప్రదర్శించిన తథాబాల్యం నాటికలో ఉత్తమ ప్రదర్శన కనబరిచాడు. ఆ బృందంలోని బాలుడు సంజయ్‌కు రూ.12,500 నగదు, సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంతకం చేసిన ప్రశంసాపత్రం, నంది అవార్డు రాష్ట్ర టెలివిజన్, నాటకరంగ సంస్థ డైరెక్టర్ పోసాని కృష్ణమురళి అందజేశారు. తథాబాల్యం నాటిక నంది నాటకోత్సవాలకు ఎంపికై నందుకు రూ.25వేలు ప్రోత్సాహక నగదు అందజేసినట్లు పాఠశాల కరస్పాండెంట్ వెనిగళ్ల మురళీమోహన్ శనివారం తెలిపారు.

బీసీ ఉద్యోగుల ప్రాంతీయ కార్యవర్గం ఎన్నిక



ఇబ్రహీంపట్నం: విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రాంతీయ కార్యవర్గం ఎన్నిక శనివారం జరిగింది. ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముప్పసాని రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రాంతీయ అధ్యక్షుడిగా ఎంవీ నారాయణరావు, కార్యదర్శిగా చింకా శ్రీహరి, కోశాధికారి శ్రీనివాసరావు, కార్యవర్గం సభ్యులను ఎన్నుకున్నారు.

సాంకేతికను అందిపుచ్చుకుంటేనే ఉద్యోగ భద్రత

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): పోటీ ప్రపంచంలో సాంకేతికతను అందిపుచ్చుకుంటేనే ఉద్యోగ భద్రత సాధ్యమని లండన్‌లోని డేటావల్లే సంస్థ ఫౌండర్ అండ్ సీఈఓ చలమలశెట్టి పవన్ చెప్పారు. పీబీ సిద్ధార్థ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో శనివారం యువత ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవడం ఎలా అనే అంశంపై కళాశాల ఆవరణలోని వెబ్‌నార్ హాల్లో సదస్సు జరిగింది. పవన్ మాట్లాడుతూ కంప్యూటర్ రంగంలో మార్పులకు అనుగుణంగా యువత నూతన సాంకేతికతను నేర్చుకోవాలని అప్పుడే ఉద్యోగం పొందవచ్చునని తెలిపారు.

వైఎస్సార్ సీపీ నేతకు నివాళి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాల్టీ వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి కుమ్మరి నాగరాజుకు పితృవియోగం కలిగింది. ఆయన తండ్రి వైఎస్సార్ సీపీ నేత బాబురావు (73) ఇటీవల అనారోగ్యానికి గురైన చికిత్స పొందుతూ శనివారం తుదిశ్వాస విడిచారు. ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ఆయన గృహానికి చేరుకుని బాబురావు మృత దేహానికి నివాళులర్పించారు.



బాబురావు మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్

భక్తుల ఇలవేల్పుగా ముగ్గురమ్మల ఆలయం

- తమిళనాడు సంప్రదాయంలో పూజలు
- జనవరి మొదటి బుధవారం జాతర

ఇబ్రహీంపట్నం: భక్తుల ఇలవేల్పుగా దొనబండలోని ముగ్గురమ్మల ఆలయం వెలుగొందుతోంది. ప్రతి ఏడాది జనవరిలో మొదటి బుధవారం ముగ్గురమ్మల జాతర ఘనంగా నిర్వహిస్తారు. ఈసారి జాతరకు ఈనెల 26వ తేదీ నుంచి తొమ్మిది రోజుల ఉపవాస దీక్షలు చేపట్టారు. 2024 జనవరి 3వ తేదీన తమిళనాడులోని మామ్‌పట్టిలో జరిగే సంప్రదాయ ఆచారాలతో జాతర నిర్వహించేందుకు ఏర్పాటు చేశారు. 1973లో తమిళనాడు నుంచి వలస వచ్చిన క్వారీ కార్మికులు తమ ఇలవేల్పుగా భావించే సత్తెమ్మ, మారెమ్మ, కాళియమ్మ ఆలయాలు ఏర్పాటు చేసుకుని నిత్యం పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. వారు చేసే పనుల్లో ముగ్గురమ్మలు కాచి కాపాడతారనే విశ్వాసం భక్తుల్లో ఉంది.

తమిళనాడు సంప్రదాయ పూజలు

తమిళనాడులోని మామ్‌పట్టిలోని హిందూ సంప్రదాయ తరహా పూజలు ఇక్కడ జరుపుతారు. తమిళనాడుకు చెందిన పూజారులు ఆరు నెలలకు ఒకరు చొప్పున ఏడాదికి ఇద్దరు నిత్య పూజలు చేస్తారు. సత్తెమ్మ, కాళియమ్మ, మారెమ్మ అమ్మవార్లకు రోజు పళ్లు, పూలు, తేనె, నెయ్యి, పాలు తదితర వస్తువులతో 10 రకాల అభిషేకాలు, వాహన పూజలు, ఆలయానికి వచ్చే భక్తులకు పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తారు. జాతరకు ముదు జరిగే నవదిన దీక్షలో ఉపవాస దీక్ష బూనిన వారు తెల్లవారు జామున స్నానాలు ఆచరించి ఉపవాసంతో రోజూ పూజలు చేస్తారు.

గగుర్పొడిచే విన్యాసాలు

ముగ్గురమ్మల జాతరకు జిల్లాలో వివిధ ప్రాంతాల్లో ఉన్న తమిళనాడు క్వారీ కార్మికులు వేల సంఖ్యలో హాజరవుతారు. ఉత్సవ విగ్రహాలకు పుణ్యస్నానాలు చేయించి ఊరేగింపుతో ఆలయాలకు చేరతారు. ఆలయాల్లో ముగ్గురమ్మలకు విశేష పూజలు, బోనాలు సమర్పిస్తారు. వేలాదిగా పాల్గొనే భక్తులు ముగురమ్మలకు మొక్కులు చెల్లించుకుంటారు. ఉపవాసం ఉన్న భక్తులు ఒళ్లు గగుర్పొడిచే విన్యాసాలు చేస్తారు. వీపునకు శూలాలు గుచ్చుకుని తాళ్లతో అమ్మవారి రథం, కార్లు లాగుతారు. తలపై అగ్నిగుండాలు పెట్టుకుని నృత్యాలు చేస్తారు. మరికొందరు నాలుక, బుగ్గలకు శూలాలు గుచ్చుకుని నిమ్మకాయలతో విన్యాసాలు చేసి అమ్మలపై భక్తిని చాటుకుంటారు.



కాచవరంలో తమిళనాడు వలస కార్మికులు నిర్మించుకున్న ముగ్గురమ్మల ఆలయం



ముగ్గురమ్మల జాతరలో వీపునకు శూలాలు గుచ్చుకుని కారును లాగుతున్న భక్తుడు (ఫైల్)

ఘనంగా ముగ్గురమ్మల జాతర



ముగ్గురమ్మల ఆలయంలో 50 ఏళ్లుగా తమిళనాడు సంప్రదాయంతో పూజలు జరుపుతున్నాం. జిల్లాలో వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన తమిళనాడు కార్మికులు ప్రతి ఏడాదీ జాతరలో పాల్గొంటారు. కమిటీ సభ్యులు 2024 జనవరి 3న జాతరకు ఏర్పాట్లు చేశారు. ఈ ఏడాది కూడా జాతర ఘనంగా నిర్వహిస్తాం.

– కందస్వామి, వేడియప్పన్, ఆలయ పూజారులు